02 . 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 265 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను కలిసి తమ కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి ఆహ్వానించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు. ఈ నెల 5 న హైదరాబాద్ లో సూర్య విక్రమాదిత్య వివాహం.

జూబ్లీహిల్స్ వెలుతురు మార్చి 01:



## మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...
# తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన

- ఎంబసీల మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటించాలని పిలుపు
- బహ్రెయిన్‌లోని తెలుగువారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఏపీ స్పీకర్ అయ్యన్న
- అవసరమైతే కేంద్రంతో మాట్లాడి క్షేమంగా రప్పిస్తామని హామీ



**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:**
గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న వేళ.. ప్రజల భద్రతే తమకు

## అసెంబ్లీ నుంచి మున్సిపల్ దాకా..
# అంతా 'వన్ సైడ్'!

- కుతంత్రాలకు దేవుడు శిక్ష వేస్తాడు
- ప్రతిపక్ష నేతలు ఒంటి నిండా విషం నింపుకుని చిమ్ముతున్నారు
- వర్షాకాలం పంట నాటికి 'పాలెం వాగు' పూర్తి చేస్తాం
- భద్రాచల నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయతో కలిసి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లకు సన్మానం

"అప్పుల రాష్ట్రంలోనూ మేము పేదవాడి ప్రేమను పొందుతూ, వారు చేయలేని పనులు చేసి



**భద్రాచలం వెలుతురు మార్చి 01:**
"రెండేళ్ల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలై.. పార్లమెంట్, ఉప ఎన్నికలు, మొన్నటి పంచాయతీ ఎన్నికలు, తాజాగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల దాకా ప్రజలు కాంగ్రెస్ పార్టీని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఏ ఎన్నిక వచ్చినా తీర్పు 'వన్ సైడ్'గానే ఉంది. ఇది జీర్ణించుకోలేని గత పాలకులు ఒంటి నిండా విషాన్ని నింపుకుని చిమ్ముతున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు, ఆ భగవంతుడు వారికి తగిన బుద్ధి చెప్పడం ఖాయం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భద్రాచలం నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల సన్మాన సభలో ఆయన ప్రసంగించారు.

**ప్రజా విజయాన్ని జీర్ణించుకోలేక విష ప్రచారం!**
పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన వారు ధనిక తెలంగాణను అప్పుల పాలు చేశారని పొంగులేటి ధ్వజమెత్తారు.



## ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో
# తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:**
ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలుగువారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు సూచించారు. ప్రత్యేకంగా పెద్ద సంఖ్యలో తెలంగాణకు

# గుజరాత్‌లో మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటన

- పాల ఉత్పత్తిలో గుజరాత్ మోడల్ తెలంగాణకు అవసరం
- పాల ఉత్పత్తిలో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలుపుతాం
- పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది
- స్వాగతం పలికిన గుజరాత్ ఎన్ డి డి బి చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, ఇతర అధికారులకు కృతజ్ఞతలు
- మంత్రి వాకిటి శ్రీహరి



*గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ పాల ప్లాంట్ ను సందర్శించిన రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి. మంత్రి బృందానికి ఘనస్వాగతం పలికిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ డి డి బి) చైర్మన్ డాక్టర్ మీనేష్ షా*

**గుజరాత్ వెలుతురు మార్చి 01:**
గుజరాత్ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆనంద్‌లోని ప్రముఖ అమూల్ పాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కలిసి సందర్శించారు. అమూల్ ప్లాంట్ సందర్శనకు వచ్చిన



# వెలుగు మట్ల బాధితులలో అర్హులకు అండగా ఉంటాం

- మార్చి 15 నాటికి వెలుగుమట్ల బాధితులలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- వెలుగుమట్ల భూదాన్ బాధితులతో చర్చించి మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి పొంగులేటి

## కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా స్వామివారికి బోనం, పట్నం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట జిల్లా వెలుతురు మార్చి 01:**
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న అంటే ఒక విశ్వాసం ఉగాది వరకు జరుపుకునే కొమురవెల్లి మల్లన్న ఉత్సవాల్లో ఆదివారం రోజున మా కుటుంబ సమేతంగా మల్లన్న బోనాలు సమర్పించుకోవడం జరిగింది.. మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు





# అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

## సీజేఐని కోరిన సీఎం చంద్రబాబు

- ఏపీ రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలతో జస్టిస్ సిటీ నిర్మాణం
- మధ్యవర్తిత్వంతో కేసు పరిష్కారమైతే రూ.10 వేలు.. లేకుంటే రూ.3 వేల సాయం
- న్యాయ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి



**అమరావతివెలుతురు మార్చి 01:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. అమరావతిలో నిర్మిస్తున్న 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, దీనికి న్యాయ వ్యవస్థ సహకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం విజయవాడలో ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సాదర స్వాగతం పలికారు. ఈ

## నేను మాట నిలబెట్టుకున్నా
# కాంగ్రెస్ ను నిలదీయండి

- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవి?
- హామీలిచ్చి మోసం చేయడంలో కేసీఆర్‌ను మించిపోయిన రేవంత్ రెడ్డి
- గ్రామాలకు పైసలివ్వని కాంగ్రెస్ గాంధీ గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడం సిగ్గు చేటు
- పంచాయతీ ఎన్నికలైన వెంటనే కేంద్రం గ్రామాలకు నిధులు మంజూరు చేసింది
- గ్రామాల అభివృద్ధి పనులకు నయాపైసా ఇయ్యని రాష్ట్ర ప్రభుత్వం
- వీళ్లా గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడేది
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్...

**కరీంనగర్ వెలుతురు మార్చి 01:**
బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహకాన్ని అందజేస్తానంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేడు నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకున్న గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, కోహెడ మండంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు తన ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.10 లక్షల చొప్పున ప్రోత్సహక నిధులు విడుదల చేశారు. ఈరోజు ఆయా గ్రామ పంచాయతీలకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామస్థుల సమక్షంలో ఆయా నిధుల సర్క్యులర్ కాపీలను గ్రామ సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ "భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా. అభివృద్ధి చేస్తా. అయినా కొందరు బండి సంజయ్ ఏం తెచ్చారంటూ విమర్శలు



**గన్నేరువరంలో ఏకగ్రీవమైన పీచుపల్లి గ్రామానికి రూ.10 లక్షల ప్రోత్సహకం అందజేసిన కేంద్ర మంత్రి**

# అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. కేవలం కోర్టు భవనాలే కాకుండా.. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట అనుసంధానిస్తూ (ఇంటిగ్రేట్) బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సంస్థల ఏర్పాటుకు అవసరమైన భూములను కేటాయించేందుకు, ఇతరత్రా పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి భరోసా ఇచ్చారు.

**మధ్యవర్తిత్వానికి ఆర్థిక ప్రోత్సాహం**

సమాజంలో మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం అందాల్సిన ఆవశ్యకతను సీఎం నొక్కిచెప్పారు. గతంలో గ్రామాల్లో పెద్దమనుషుల సమక్షంలో చాలా సమస్యలు పరిష్కారమయ్యేవని, తన తండ్రి కూడా గ్రామంలో ఇలాంటి పెద్దరికం వహించి ఎన్నో వివాదాలను పరిష్కరించారని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారమైతే రూ.10 వేలు, ఒకవేళ పరిష్కారం కాకపోయినా ఆ ప్రక్రియలో పాల్గొన్నందుకు రూ.3 వేలు అందిస్తామని ప్రకటించారు. న్యాయం త్వరగా జరిగితేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, అందుకే ఇలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రభుత్వానికి భారం కాదని అభిప్రాయపడ్డారు.

**బ్లూ-గ్రీన్ సిటీగా అమరావతి**

దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమరావతిని బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇవ్వడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. ప్రజల అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక బలం కలగలిసిన నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నేను మాట నిలబెట్టుకున్నా కాంగ్రెస్ ను నిలదీయండి

చేస్తున్నారు. వాటిని నేను పట్టించుకోను. ఎందుకంటే నా లక్ష్యం గ్రామాలను అభివృద్ధి చేయడమే. ఎందుకంటే గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. వీటితోపాటు ప్రజల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తా."అని పునరుద్ఘాటించారు. అనంతరం పీచుపల్లికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సామ రాజిరెడ్డి, బీజేపీ స్థానిక నేతలకు తన ఎంపీ లాడ్స్ నుండి రూ.10 లక్షల ప్రోత్సాహక నిధుల సర్క్యులర్ కాపీని అందజేయడంతోపాటు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానని గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేను నిలబెట్టుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తానని ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1203 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఒక్కో పంచాయతీకి 10 లక్షల చొప్పున మొత్తం 120 కోట్ల 30 లక్షల రూపాయలు ఇవ్వాలి. కానీ ఇంతవరకు నయాపైసా ఇయ్యలే."అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. "హామీలిచ్చి మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ సర్కార్ ను మించిపోయారు. కేసీఆర్ సైతం ఆనాడు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి 5 నుండి 10 లక్షలదాకా ప్రోత్సాహక నగదు అందిస్తామని హామీ ఇస్తే... దాదాపు 2 వేలకుపైగటా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యాయి. కానీ చిల్లిగవ్వ ఇయ్యలే. ఈ రెండు పార్టీలు దొందూ దొందే. ప్రోత్సాహక నిధులు ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలను కోరుతున్నా."అని పిలుపునిచ్చారు. "రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడంలేదు. మాజీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులివ్వాలని తిరిగి తిరిగి ఆత్మహత్యలు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలే. ఈ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది. బీజేపీ పోరాటాలకు, మాజీ సర్పంచుల ఆందోళనలకు తలొగ్గి వాయిదాల పద్దతిలో పైసలిచ్చేందుకు ముందుకొచ్చింది. మాజీ సర్పంచుల బిల్లులు సరే... గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసలేవి? కేంద్రం ఇప్పటి వరకు పంచాయతీల అభివృద్ధి కోసం దశల వారీగా దాదాపు వెయ్యి కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అంతో ఇంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. వీళ్లా గ్రామ స్వరాజ్యం....గాంధీ ఆశయాల గురించి మాట్లాడేది?"అని ఆ ప్రకటనలో విమర్శించారు.

## మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...

## తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన

ముఖ్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అక్కడి తెలుగువారు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలు, భద్రతా సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పౌరులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడి ఎంబసీలతో టచ్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బహ్రెయిన్‌లోని తెలుగువారి భద్రతపై ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఆందోళన నెలకొంది. అక్కడ సుమారు 50 వేల మంది ఏపీ వాసులు ఉపాధి పొందుతుండగా, వారిలో అయ్యన్న సొంత నియోజకవర్గమైన నర్సీపట్నం వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్.. ధైర్యంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా సాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయ్యన్న తెలిపారు. పరిస్థితి విషమిస్తే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మాట్లాడి.. తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో

# తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

చెందిన కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు నివసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత యుద్ధ ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో మిసైల్ దాడుల భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన కోరారు. యుద్ధ ప్రభావంతో కొన్నిచోట్ల విమానాశ్రయ సేవలు అంతరాయం కలిగినట్లు సమాచారం అందుతోందని, గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు కార్మికులు, ముఖ్యంగా తెలంగాణకు చెందిన వారు ఇబ్బందులు పడుతున్నారనే వార్తలు వస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ గారు ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకుని తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. యూ.ఏ.ఈ, ఇరాన్ ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు స్థానిక అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని, పరిస్థితులు సాధారణం అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారత రాయబార కార్యాలయాలతో నిరంతర సంబంధం కొనసాగించాలని సూచించారు. ప్రత్యేకంగా నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన గల్ఫ్ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని, అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారం ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ నుంచి మున్సిపల్ దాకా.. అంతా 'వన్ సైడ్'!

చూపిస్తుంటే ప్రతిపక్షాలకు అరగడం లేదు. అందుకే ముఖ్యమంత్రిపై, మంత్రులపై అవాకులు చెవాకులు పేలుతున్నారు. నిజం చెప్పే ధైర్యం, జ్ఞానం వారికి ఆ దేవుడు ఇవ్వలేదు. మళ్ళీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాత సీట్ల కంటే మరో 10 స్థానాలు అదనంగా గెలిచి, తెలంగాణ గడ్డపై మరోమారు మూడు రంగుల జెండా రెపరెపలాడటం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు.

**లక్ష కోట్లు దోచారు.. పాలెం వాగును వదిలేశారు**

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. "దివంగత నేత రాజశేఖర్ రెడ్డి పాలెం వాగు ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే, పదేళ్ల పాలనలో దానిని పూర్తి చేయాలనే జ్ఞానం వీరికి రాలేదు. 15 వేల ఎకరాలకు నీరు రావాల్సి ఉంటే, కేవలం 3-4 వేల ఎకరాలకే అందుతోంది. రెండు మూడు రోజుల్లోనే సీతక్క, నేను, ఇరిగేషన్ మంత్రి చర్చించి, రాబోయే వర్షాకాలం పంట నాటికి పాలెం వాగు మిగిలిన పనులన్నీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. అలాగే రాళ్లవాగు వంతెనను కూడా ఇదే సీజన్లో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**ఖాతాల్లోకి నేరుగా 'ఇందిరమ్మ' నిధులు**

ఒకటో తారీఖున ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు పడ్డట్టే, ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే ఇందిరమ్మ ఇళ్ల నిధులు జమ చేస్తున్నాం. ములుగు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ప్రాంతాల్లో తార్పాల్ గుడిసెల కింద నివసించే నిరుపేదలను చూసి, ఈ నియోజకవర్గాలకు మొదటి విడతలో అదనపు ఇళ్లను కేటాయించాం. ఏప్రిల్‌లో రెండో విడత ఇస్తాం.. ఇలా మొత్తం మూడు విడతల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తాం. ఇది కాగితాలకే పరిమితమయ్యే ప్రభుత్వం కాదు.

**అధికార తాళం చెవి మీ దగ్గరే ఉండాలి!**

కొత్తగా ఎన్నికైన మహిళా సర్పంచులకు మంత్రి పొంగులేటి ఆత్మీయ పిలుపునిచ్చారు. "మీరు ఎన్నికయ్యారు.. పరిపాలన కూడా మీరే చేయండి. అధికార తాళం చెవులను మా తమ్ముళ్ల (భర్తల) చేతికి ఇచ్చి మీరు వెనుక ఉండకండి. మంత్రి సీతక్క ఏ విధంగా ధైర్యంగా పాలిస్తున్నారో, మీ గ్రామ పంచాయతీల్లో మీరు కూడా అదే విధంగా పాలించి ఆదర్శంగా నిలవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), స్థానిక పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటన



మంత్రిబృందానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) చైర్మన్ డాక్టర్ మీనేష్ షా బృందం ఘనస్వాగతం పలికింది. ఈ సందర్భంగా అమూల్ సంస్థలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పాల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ వ్యవస్థలపై మంత్రి బృందానికి చైర్మన్ డాక్టర్ మీనేష్ షా వివరించారు. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, సహకార వ్యవస్థను మరింత విస్తరించడం వంటి అంశాలపై మంత్రి బృందానికి గుజరాత్ ఎన్‌డీడీబీ అధికారులు వివరించారు. అమూల్ మోడల్ ప్రగతి పథంపై, దేశవ్యాప్తంగా సహకార డెయిరీ రంగ అభివృద్ధిలో ఎన్‌డీడీబీ పాత్రపై మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, గుజరాత్‌లో అమూల్ మోడల్ ద్వారా సాధించిన విజయాలు తెలంగాణకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వము కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మహిళల ఆర్థిక సాధికారతలో డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. పాల ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, సహకార వ్యవస్థ బలోపేతం, రైతులకు మెరుగైన ధరలు అందించే దిశగా గుజరాత్ అనుభవాలను తెలంగాణలో అమలు చేయాలని మంత్రి తెలిపారు. గుజరాత్‌లో గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పాల ఉత్పత్తి కేంద్రాల అభివృద్ధి ఆదర్శనీయమని అన్నారు. తెలంగాణలో పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి శ్రీహరి వెల్లడించారు. గుజరాత్ పర్యటనకు వచ్చిన సందర్భంగా స్వాగతం పలికిన ఎన్‌డీడీబీ చైర్మన్ డాక్టర్ డాక్టర్ మీనేష్ షాకు, ఇతర గుజరాత్ రాష్ట్ర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# వెలుగు మట్ల బాధితులలో అర్హులకు అండగా ఉంటాం

**ఖమ్మం, వెలుతురు మార్చి 01:**

వెలుగుమట్ల భూదాన్ భూములలో ఉన్న ఆక్రమణల తొలగింపులో నిరాశ్రయానికి గురైన అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా కల్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం కలెక్టరేట్ లో వెలుగుమట్ల బాధితులతో చర్చించి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేసినట్లు తమకు సమాచారం వచ్చిందని, బాధితులు ఎవరికైనా డబ్బులు ఇస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ బాధితులలో అర్హులైన పేదలకు వారి సొంత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. వెలుగుమట్ల అంశాన్ని కొందరు రాజకీయాలకు వాడుతున్నారని, తాము ఈ అంశాన్ని కేవలం పేదల కోణంలోనే చూస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ ప్రభుత్వంలో అన్యాయం జరిగే ప్రసక్తే ఉండదన్నారు. వెలుగుమట్ల ప్రభుత్వ భూదాన్ భూముల ఆక్రమణలో తప్పు ఒకరు చేస్తే, శిక్ష మరొకరికి వచ్చినట్లు కొంతమంది బాధితులు తెలియక అక్కడ ఇండ్ల పట్టాలు పొందామనే భ్రమలో ఇండ్లు కట్టుకున్నారని మంత్రి అన్నారు. వెలుగుమట్ల సంఘటనలో బాధితులు ఎప్పటినుంచి ఇక్కడ ఉంటున్నారు, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అధికారులతో క్షుణ్ణంగా విచారణ చేయించి నిరుపేదలకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్నవాళ్లు కూడా ఉన్నట్లు తెలుస్తోందని, అటువంటి వారికి కాకుండా మిగిలిన అర్హులైన పేదలందరికీ ఖమ్మం పరిసర ప్రాంతాల్లో, సంబంధిత బాధితుల సొంత ప్రాంతాల్లో ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. బాధితులు వెలుగుమట్ల ఇంటి స్థలం కోసం ఎవరికి డబ్బులు ఇచ్చారో నిర్భయంగా పోలీసు అధికారులకు చెప్పాలని, ఆ డబ్బులు కూడా బాధితులకు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. వెలుగుమట్ల బాధితులకు ఇచ్చే ఇండ్ల దగ్గర అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, త్రాగు నీరు, విద్యుత్ సౌకర్యం, మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. పేద ప్రజల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, గత పాలకులు వెలుగుమట్ల బాధితులకు పట్టాలు పంపిణీ చేయని కారణంగానే నేడు కూల్చివేతలు జరిగాయని మంత్రి అన్నారు. ప్రతి అంశాన్ని రెచ్చగొట్టే ధోరణితో చూడవద్దని తెలిపారు. మార్చి 15 నాటికి అర్హులైన పేదలకు తప్పనిసరిగా ఇళ్లస్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వెలుగుమట్ల సంఘటన బాధితులకు న్యాయం చేయడానికి తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. మంత్రి వివరణ అనంతరం వెలుగుమట్ల బాధితులు దళారులకు ఎలా డబ్బులు ఇచ్చి మోసపోయామో మీడియా ప్రతినిధుల ఎదుట వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు, వెలుగుమట్ల బాధితులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా స్వామివారికి బోనం, పట్నం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాలు అవరోధాలు లేకుండా చూడాలని స్వామివారిని వేడుకున్న ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో కొమురవెల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం.. భక్తులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.. ప్రారంభానికి సిద్ధంగా 50 గదులు ఉన్నాయి.. క్యూ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుంది, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది, రవాణా సదుపాయాలు ఉన్నాయి.. కొమురవెల్లి లో యాదాద్రి మాదిరి స్థల సేకరణ చేస్తే ధాతల సహకారంతో రూం లు నిర్మించే అవకాశం కల్పిస్తుంది.. కొమురవెల్లి మల్లన్న అంటే బడుగు బలహీన వర్గాలకు అండగా భక్తులకు ఆశీర్వాదం ఇచ్చే దేవుడిగా ప్రసిద్ధి ప్రభుత్వ తరుపున అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.. భారత దేశ భవిష్యత్ నిర్మాణంలో తెలంగాణ నిర్మాణం ఉంటుంది.. విద్య విషయంలో రాజకీయం చేయవద్దని కోరుతున్న.. రాజకీయ పార్టీగా మీరు విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ లో ఏమైనా పొరపాటు ఉంటే సవరిస్తూ సూచనలు చేయండి.. గత ప్రభుత్వం లో మీరు ఏదైనా కార్యక్రమం చేసినట్టయితే తెలంగాణ విద్య విధానం బాగుపడింది అంటే మీ అంశాలు స్వీకరిస్తాం.. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ఆ అంశాన్ని ప్రభుత్వం అమలు చేయదు.. కానీ దురుద్దేశపూర్వకంగా అన్ని అంశాలకు విమర్శిస్తే అంటే పొరపాటు.. విద్యా కమిషన్ రిపోర్ట్ లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని చెప్పడాని నేను స్వాగతిస్తున్న ఒక వేళ విద్యార్థి సంఘ ఎన్నికలు లేకపోతే పొన్నం ప్రభాకర్ మొదటి జనరేషన్ లో రాజకీయాల్లోకి వచ్చేదే కాదు నాలాంటి అనేక మంది రాజకీయాల్లోకి రావాలనుకునే విద్యార్థులకు వేదిక లేక విద్యార్థి సంఘాల ఎన్నికలు లేక విద్యావంతులు రాజకీయాలు లేక ఇబ్బందులు వస్తున్నాయి... విద్యా కమిషన్ సూచనలు రాబోయే క్యాబినెట్ లో ముఖ్యమంత్రి గారికి ఇతర మంత్రులకు వివరించి విద్యార్థి సంఘ నాయకుడిగా యూనివర్సిటీ మాదిరిగా ఎన్నికలు నిర్వహించండి.. నేను ఎస్ఆర్ఆర్ కాలేజీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్నికలు జరిగాయి.. గతంలో విద్యార్థి సంఘాల దర్శన వల్ల ఎన్టీఆర్ హయాంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు అయ్యాయి దానిని బూచిగా చూపెట్టి విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేశారు.. విద్యాలయాల సమస్యలు విద్యార్థి ఎన్నికలు జరిగినట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం చేయడానికి బాగుంటుంది విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని గతంలో అనేక సార్లు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయా.. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎన్నికలు జరిగే విధంగా వచ్చే క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటాం తెలంగాణ రాష్ట్రంలో విద్య వంతులు అయిన నూతన నాయకత్వం వస్తుంది.. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 40 శాతం మంది కేబినెట్ మంత్రులు విద్యార్థి సంఘాల నుండి వచ్చిన వారే ఉన్నారు.. విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే వారికి విశేషమైన అనుభవం ఉంటుంది.. ఆలోచన విధానం ఉంటుంది.. విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహించాలనే అంశాన్ని బలపరుస్తున్న..

# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం - ట్రంప్

- **అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి**
- **ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్**
- **ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర**
- **భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు**

**వాషింగ్టన్, వెలుతురు మార్చి 01:**

"ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతొల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా... పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

# సమాచార లోపంతోనే శారదా పీఠం భూములపై గందరగోళం


**- పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునేందుకు మాకెలాంటి భేషజాలు లేవు**

**- మతాన్ని అడ్డు పెట్టుకొని మాపై ప్రతిపక్షాల దుష్ప్రచారం**

**- పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు**







**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:** కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో 'సమాచార లోపం' వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేట్ లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి... అక్కడి రాజ శ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. మా ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకొని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరూ మాపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపు ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**







**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:**
ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో ఎస్ఎస్ఎస్ యువ సేన ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 89వ జయంతి(మార్చి 2న)ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర ఆపరేషన్ల సమయంలో రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడే చిన్న పిల్లలకు ప్రతి నెలా రక్తం ఎక్కించడం వారి జీవనాధారంగా మారిందన్నారు. ఇలాంటి తరుణంలో మనమిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తం ఇచ్చేటప్పుడు ఎవరూ కులం, మతం, ప్రాంతం చూడరని.. ఇది మనుషులందరినీ కలిపే గొప్ప మానవత్వమన్నారు. అపోహలు వీడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

# మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ అత్యవసర సమావేశం



**- ఢిల్లీకి రాగానే అత్యవసరంగా సమావేశం కానున్న ప్రధాని మోదీ**

**- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సీసీఎస్ భేటీ**

**- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి వార్తలతో పెరిగిన ఆందోళన**

**- గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ**

**- రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక మంత్రులతో కీలక సమీక్ష**

**ఢిల్లీ వెలుతురు మార్చి 01:**
రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ కానున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకుంటారు. వచ్చిన వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమవుతారు. ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరగనుంది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

# బ్యాంకుల విలీనం సామాన్యుడికి లాభమా? కార్పొరేట్లకు వరమా?




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశంలో, బ్యాంకింగ్ అనేది కేవలం డబ్బు దాచుకునే చోటు మాత్రమే కాదు, అది సామాన్యుడి ఆశలకు, ఆశయాలకు ఒక చిరునామా. దశాబ్దాలుగా మన దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (గూదీం) కేవలం ఆర్థిక సంస్థలుగానే కాకుండా, సామాజిక మార్పుకు సాధనాలుగా నిలిచాయి. ఒక సన్నకారు రైతుకు అందే పంట రుణం నుండి, ఒక మధ్యతరగతి విద్యార్థి విదేశీ విద్య కోసం పొందే విద్యా రుణం వరకు,ప్రతిచోటా ఈ బ్యాంకుల ముద్ర ఉంది. అయితే, గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బ్యాంకుల విలీన ప్రక్రియ (Bank Mergers) దేశవ్యాప్తంగా ఒక పెద్ద చర్చకు తెరలేపింది. ఈ విలీనం వల్ల బ్యాంకులు బలోపేతం అవుతాయని ప్రభుత్వం అంటుంటే, ఇది సామాన్యుడిని బ్యాంకుకు దూరం చేసే కుట్ర అని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ విలీన కథాకమీమాంషు ఏమిటో లోతుగా పరిశీలిద్దాం. మన బ్యాంకింగ్ చరిత్రను ఒకసారి తిరగేస్తే, 1969లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 14 ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయడం ఒక చారిత్రాత్మక మలుపు. ఆ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం బ్యాంకింగ్ సేవలు సామాన్యుడి ముంగిటకి చేరాలి అనేది. అప్పటి వరకు కేవలం పారిశ్రామికవేత్తలకే పరిమితమైన బ్యాంకులు, జాతీయీకరణ తర్వాత పల్లెటూళ్లలోకి అడుగుపెట్టాయి. 1980లో మరో 6 బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. అయితే, 2017 నుండి సీన్ మారింది. ప్రభుత్వం పెద్దే ముద్దు (Big is Beautiful) అనే నినాదంతో విలీన ప్రక్రియను వేగవంతం చేసింది. 2017 లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో దాని 5 అనుబంధ బ్యాంకులు మరియు భారతీయ మహిళా బ్యాంక్ విలీనం. 2019 లో విజయ బ్యాంక్ మరియు దేనా బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయడం. 2020 లో 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను కలిపి 4 పెద్ద బ్యాంకులుగా మార్చడం (ఉదాహరణకు: ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్‌లను యూనియన్ బ్యాంక్‌లో కలపడం). దీని ఫలితంగా 2017లో 27గా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య ఇప్పుడు కేవలం 12కి పడిపోయింది. ఈ భారీ మార్పు వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ఏమిటి? ప్రభుత్వ దృష్టిలో విలీనం అనేది ఒక ఆర్థిక సంస్కరణ. దీని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రభుత్వం ఇలా వివరిస్తోంది,చిన్న చిన్న బ్యాంకుల దగ్గర తక్కువ నిధులు ఉండటం వల్ల అవి పెద్ద ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వలేకపోతున్నాయి. విలీనం వల్ల బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ పెరిగి, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే గ్లోబల్ బ్యాంకులు తయారవుతాయి.ఒకే వీధిలో మూడు వేర్వేరు ప్రభుత్వ బ్యాంకులు ఉండటం వల్ల అనవసరమైన ఖర్చులు (అద్దె, నిర్వహణ) పెరుగుతున్నాయి. విలీనం వల్ల ఈ డూప్లికేషన్ తగ్గి లాభాలు పెరుగుతాయి.పెద్ద బ్యాంకులకు ఉండే ఆధునిక టెక్నాలజీ (Digital Banking) చిన్న బ్యాంకులకు కూడా అందుబాటులోకి వస్తుంది. మొండిబాకీల (NPA) రికవరీ కోసం ఒక కేంద్రీకృత వ్యవస్థ ఉంటే అది మరింత సమర్థంగా పనిచేస్తుందని ప్రభుత్వం నమ్ముతోంది. ప్రభుత్వం చెప్పే లెక్కలు కాగితం మీద బాగున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. విలీనం వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ,విలీనం తర్వాత రేషనలైజేషన్ పేరుతో వేలాది శాఖలను మూసివేస్తున్నారు. ముఖ్యంగా పల్లెల్లోనూ, చిన్న పట్టణాల్లోనూ బ్యాంకులు



మాయమవుతున్నాయి. తమకు తెలిసిన మేనేజర్, తమ భాషలో మాట్లాడే సిబ్బంది ఉన్న బ్యాంకు మూతపడటంతో గ్రామీణ ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.రెండు, మూడు బ్యాంకులు కలిసినప్పుడు వాటి సాఫ్ట్‌వేర్‌లు మారతాయి, పని సంస్కృతి మారుతుంది. ఈ గందరగోళంలో సామాన్య ఖాతాదారులకు ఇచ్చే సేవలలో నాణ్యత పడిపోతోంది. చెక్కుల క్లియరెన్స్ నుండి పాస్‌బుక్ ప్రింటింగ్ వరకు ప్రతిదానికీ నిరీక్షణ తప్పడం లేదు. విలీనం వల్ల కొత్త నియామకాలు భారీగా తగ్గాయి. ఉన్న ఉద్యోగులపై పని భారం పెరగడం, బదిలీల భయం వారి పనితీరుపై ప్రభావం చూపుతోంది. ఇది పరోక్షంగా ఖాతాదారులకు అందే సేవలను దెబ్బతీస్తోంది.ఈ విలీన ప్రక్రియ వెనుక అసలు రహస్యం కార్పొరేట్ మొండిబాకీల ను కప్పిపుచ్చడమేనని ఆర్థిక నిపుణుల ప్రబలమైన విమర్శ. దీనికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి,ఒక లాభాల్లో ఉన్న బ్యాంకును, భారీగా మొండిబాకీలు ఉన్న బ్యాంకుతో కలిపినప్పుడు ఆ నష్టాలు మొత్తం వ్యవస్థలో కలిసిపోతాయి. అంటే, ఒక పెద్ద కార్పొరేట్ సంస్థ ఎగ్గొట్టిన వేల కోట్ల రూపాయలను సామాన్యుడి పొదుపు సొమ్ముతో సరిపెడుతున్నారన్నమాట.ఒక బ్యాంకు చాలా పెద్దగా ఎదిగినప్పుడు, అది దివాళా తీస్తే దేశ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలుతుంది. అప్పుడు ప్రభుత్వం ప్రజల పన్నుల సొమ్ముతో (Taİpayers» Money) ఆ బ్యాంకును రక్షించాల్సి వస్తుంది. దీనినే కార్పొరేట్ సోషలిజం అని పిలుస్తారు. అంటే లాభాలు వస్తే కార్పొరేట్లకు, నష్టాలు వస్తే ప్రజలకు! పెద్ద బ్యాంకులు ఏర్పడిన తర్వాత, అవి 500 కోట్లు, 1000 కోట్ల రుణాల పైనే ఆసక్తి చూపుతాయి. ఒక సాధారణ రైతు అడిగే 50 వేల రుణం లేదా ఒక చిరు వ్యాపారి అడిగే 2 లక్షల రుణం ఆ బ్యాంకులకు చిల్లర వ్యవహారం గా కనిపిస్తుంది. భారతదేశ ఆత్మ గ్రామాల్లో ఉంది. కానీ విలీన ప్రక్రియ పట్టణ కేంద్రితంగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే రీజినల్ రూరల్ బ్యాంక్స్ (RRBs) కూడా ఇప్పుడు ఈ కోరల్లో చిక్కుకున్నాయి. ప్రాధాన్యత రంగాలకు (వ్యవసాయం, MSME) రుణాలు ఇవ్వడం కంటే, కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులు పెట్టడానికే పెద్ద బ్యాంకులు మొగ్గు చూపుతున్నాయి. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (AIBEA) వంటి సంఘాలు విలీనాన్ని నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. వారి వాదన ప్రకారం బ్యాంకుల సమస్య పరిమాణం (ాఅఓవ) కాదు, అది వసూళ్లు (Recovery). బ్యాంకుల వద్ద ఉన్న 10 లక్షల కోట్ల పైచిలుకు మొండిబాకీలను వసూలు చేయడానికి కఠిన చట్టాలు తీసుకురాకుండా, విలీనం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదు సదా, అది మరింత జటిలం అవుతుందని వారు హెచ్చరిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు అవసరమే, కానీ అవి విలీన రూపంలోనే ఉండాలా? నిపుణులు కొన్ని ప్రత్యామ్నాయాలను సూచిస్తున్నారు ,బ్యాంకుల బోర్డుల్లో రాజకీయ నియామకాలు ఆపి, వృత్తిపరమైన నిపుణులను నియమించాలి. పెద్ద కార్పొరేట్ రుణగ్రహీతల ఆస్తులను వేగంగా జప్తు చేసే అధికారం బ్యాంకులకు ఉండాలి.విలీనం చేయకుండానే, బ్యాంకుల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంచవచ్చు. స్థానిక అవసరాలను తీర్చే చిన్న బ్యాంకులకు (Small Finance Banks) మరిన్ని రాయితీలు ఇవ్వాలి. చివరగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న ఒకటే: పబ్లిక్ రంగ బ్యాంకులు ఎవరి సొత్తు? అవి ప్రజల కష్టార్జితంతో, పన్నుల డబ్బుతో ఏర్పడినవి. వాటి ప్రధాన లక్ష్యం లాభాల వేట కాదు, సామాజిక న్యాయం. విలీనం పేరుతో మనం ఈ లక్ష్యాన్ని విస్మరిస్తున్నామా? గ్లోబల్ బ్యాంకుల కల బాగుంది, కానీ ఆ కలలో సామాన్య రైతుకు, మధ్యతరగతి జీవికి చోటు లేకపోతే ఆ ఆర్థిక వృద్ధికి అర్థం లేదు. విలీనం అనేది కేవలం అంకెలను సర్దుబాటు చేసే ప్రక్రియగా మిగిలిపోకూడదు. అది ప్రతి పౌరుడికి ఆర్థిక భద్రతను ఇచ్చే విధంగా ఉండాలి. బ్యాంకులు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కాకుండా, సామాన్యుడి స్వప్నాల కోసం పనిచేయాలి. అప్పుడే జాతీయీకరణ లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వం తన విధానాలను పునఃసమీక్షించుకోవాల్సిన సమయం సన్నమైంది. ఆర్థిక సంస్కరణలు అనేవి ప్రజల కోసం ఉండాలి తప్ప, ప్రజలను ఇబ్బంది పెట్టేవిగా ఉండకూడదు. ఈ విషయంలో చైతన్యం కేవలం ఆర్థిక నిపుణుల్లోనే కాదు, ప్రతి ఖాతాదారుడిలోనూ కలగాలి.


# ఆదర్శప్రాయులు శ్రీపాదరావు!



సాగర్ వనపర్తి,
పొలిటికల్ అనలిస్టు,
910000402.

*నాయకుడు అంటే నలుగురితో నలుగురి కోసం నడిచేవారనే సూత్రం అక్షరాల నిజం చేసిన నేత మహనీయులు దుద్దిల్ల శ్రీపాదరావు. ప్రతి వ్యవస్థలో కొందరు భౌతికంగా వెళ్ళిపోయినా మన మనస్సుల్లో ఇంకా నిలిచిపోతుంటారు. అందులో ధృవ-తార దుద్దిళ్ళ శ్రీపాదరావు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులకు ఈయన పరిచయం ప్రత్యేకశీగా అక్కర్లేదు. కరీంనగరు జిల్లా కేంద్రంలో బస్సు దిగ్గానే ఆయన విగ్రహం నిటారుగా కనిపిస్తుంది. ఆ విగ్రహం చూస్తూనే అటు ఇటుగా వెళ్ళేవాళ్ళు ఉంటారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పీవీ తర్వాత అత్యంత ఉన్నత స్థానంలోకి ఎదిగిన ఏకైక నాయకుడు శ్రీపాదరావు మాత్రమే. ప్రజాహితమే లక్ష్యంగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలన్న నాయకులు కనుమరుగు అవుతున్న నేటి తరుణంలో ఆయన రాజకీయ జీవితం అందరికీ ఒక దిక్సూచిలాంటిది. నేడు రాజకీయాలంటే దోచుకోవడం దాచుకోవడం అంటూ కొత్త నిర్వచనం ఇస్తున్న పొలిటిషియన్స్ కి ఆయన గురించి పెద్దగా తెల్వకపోవచ్చు. కానీ, ప్రజలు మాత్రమ ఇటువంటి నేత గురించి తెల్సుకోవాల్సిన అనివార్యత ఉన్నది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి వంటి త్రివేణి సంగమం, మానేరు నది పారే ప్రాంతంలో పుట్టిన బిడ్డగా ప్రజా సేవలో తన మార్కు చూపించిన నాయకుడు శ్రీపాదరావు తెలంగాణా రాజకీయ యవనికపై చిరస్మరణీయులు.*

మంథని వంటి మారుమూల ప్రాంతంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా సబ్బండవర్ణాల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసిన నేత శ్రీపాదరావు. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో అత్యున్నతమైన శాసనసభ స్పీకర్ పదవి నిర్వహించి, ఆ పదవి కూడా వన్నె తీసుకొచ్చిన మహనీయుడాయన. కొంతమంది రాజకీయ నేతల ఆత్మకథల్లో పేర్కొన్నట్టు శ్రీపాదరావు ఒకానొక పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలోనే ఏపీ ముఖ్యమంత్రి పదవికీ పోటీ పడ్డారన్నది నిజంగా సంభ్రమాశ్చర్యమే. ఇప్పటికీ రిమోట్ ఏరియాగా లాగా అనిపించి మంథని ప్రాంతంలో ఎటువంటి సమాచార మార్పిడి వ్యవస్థ లేని పాత కాలంలో ఉత్తరాల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ వాటి పరిష్కారానికై ఆయన స్వయంగా అందుబాటులో ఉన్న బస్సులు, ఎడ్ల బండ్ల మీద తిరుగుతూ వాటిని పరిష్కరించవారేనని అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇంకేం, గెలిచాం కదా పదవిని ఎంజాయ్ చేద్దామని ఆ రోజుల్లో కూడా కొంతమంది నాయకులు ఉండేవారని నాకు మా నాన్న(వనపర్తి రాజమౌళి, సుల్తానాబాద్ మండలం, చిన్నబొంకూరు మాజీ సర్పంచు) తరచూ చెబుతుండేవారు. కానీ, శ్రీపాదరావు అటువంటి నేత కాదని తెలిపారు. మా నాన్న తనకి సంబంధించిన ఒక పని మీద అప్పటి రోజుల్లో మా సొంత నియోజకవర్గం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందర్ రెడ్డి సిఫార్సు లెటర్ తీసుకొని వెళితే శ్రీపాదరావు మా నాన్నను చూడగానే ఎంతో ఆప్యాయంగా పలకరించి సదరు పని చేసినట్టు మా నాన్న చెబుతూ ఆనందపడేవారు. అంటే, శ్రీపాదరావు నమ్ముకున్న కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు ఎంత విలువ, సమయం ఇచ్చేవారో చెప్పేందుకు నాన్న చెప్పిన ఒక సందర్భంను ఇక్కడ చెబుతున్నాను నేను. ఒక నాయకుడు




తనకి పరిచయం ఉన్నా... పరిచయం లేని కార్యకర్తకి అయినా ఒక చిన్న పని చేసినా వారి మరణాంతరం కూడా ఎంతలా గుర్తు పెట్టుకుంటారని చెప్పేందుకు ఈ ఉదంతమే నిలువుటద్దం. ఎన్నికల్లో తన కోసం పని చేసిన మనుషులకు పార్టీ కార్యకర్తలకు మళ్ళీ ఏదైనా పనులు చేయాలన్న తపన్న ఉన్న నాయకులు ఈ కాలంలో ఉహించగలమా? నాయకులకు, కార్యకర్తలకు ప్రస్తుత రోజుల్లో గ్యాప్ ఏర్పడుతున్నది. దాని వల్లే అధికారాలు కోల్పోవడం, ఓడిపోవడాలు జరుగుతున్నాయి. కానీ, శ్రీపాదరావు మంథని నియోజకవర్గం నుంచి అన్నిసార్లు గెలిచారంటే కార్యకర్తల కోసం, సామాన్య జనం కోసం ఆయన చేసిన కృషి మాత్రమే కారణమని ఆ ప్రాంత బిడ్డగా స్పష్టంగా చెప్పగలను. ఇక నేడు అసెంబ్లీ అంటే నాయకుల మధ్య గొడవ జరిగే ప్రదేశం అని.. ప్రజల సమస్యలు ప్రస్తావించే వేదిక ఇది కాదు అనే అభిప్రాయం సహజంగా ఏర్పడింది. దీనికి కారణం కారకం చాలా ఉన్నాయి. అవి ఇప్పుడు చర్చించడం సందర్భోచితం కాదు. కానీ, శ్రీపాదరావు మాత్రం చట్టసభ సభ్యుడిగా ఉన్నప్పుడైనా... స్పీకర్ గా ఉన్నప్పుడైనా ప్రజా సమస్యల కోసం మాత్రమే అత్యధిక సమయం వెచ్చించేవారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుని హోదాలో ఎన్టీఆర్, శ్రీపాద రావు స్పీకర్ గా ఏకగ్రీవ ఎన్నికకు సహకరించారంటే, ఆయనలోని విలక్షణత ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రభంజనంలో సైతం శ్రీపాదరావు శాసన సభకు ఎన్నికవడం చూస్తే ప్రజలతో ఆయన నెరిపిన సంబంధం ఎట్లాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన రక్త వారసత్వం, రాజకీయ వారసత్వం అందిపుచ్చుకుని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా శ్రీధర్ బాబు ఎంతలా పని చేస్తున్నారు మనమశీతా రోజూ చూస్తున్నాం. చదువుతున్నాం. అదంతా ఒక తండ్రి ఒక కొడుక్కి ఇచ్చిన క్రమశిక్షణగా చెప్పుకోవచ్చు. ఇక నేటి తరం నాయకులు రాజకీయాల్లో రాణించాలంటే మహనీయులు శ్రీపాదరావును స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇక ఆయన తనయులు, రాష్ట్ర మంత్రి, నిత్యం ప్రజల కోసం కష్టపడే శ్రీధర్ బాబు మాదిరి ముందుకు వెళితే సరిపోతుందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

# సంపాదకీయం.. ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ



రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి.ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పాలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ ఫెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు ఎంమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

## 5.664 కేజీల గంజాయి పట్టివేత..

**- నలుగురు అరెస్ట్, మరో ఏడుగురుపై కేసు నమోదు.**




**బషీర్ బాగ్ వెలుతురు 1 మార్చ్ :**
దూల్పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎస్టిఎఫ్ ఎ టీం లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి నిర్వహించిన దాడుల్లో తనిఖీల్లో 5.564 కేజీల గంజాయి లభ్యమయింది. ఈ కేసులో రెండు టూ వీలర్స్ ని నాలుగు మొబైల్స్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో శ్యామ్ సుశీల్ నటి కర్, రాజాసింగ్, కునాల్,సంతోష్ సింగ్ లను అరెస్ట్ చేశారు. వీరితోపాటు మరో ఏడుగురిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితులు పరారులో ఉన్నట్లు తెలిపారు. నలుగురు నిందితులను గంజాయిని బైకులను దూల్పేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్టిఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

## హస్తినాపురంలో ఘనంగా ఆదిత్య హాస్పిటల్ ప్రారంభోత్సవం

**- ఎంపీ ఈటెల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**





**హస్తినాపురం వెలుతురు మార్చి 01:**
హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ లో ఆదిత్య హాస్పిటల్ ఘనంగా ప్రారంభోత్సవం చేశారు ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతమైన వైద్య సేవలు ఆధునిక టెక్నాలజీతో అందించడానికి వీలు కల్పిస్తున్న సంస్థ ఆదిత్య హాస్పిటల్ అని అన్నారు ఈ కార్యక్రమంలో హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ శ్రీలత ఇగ్గా డాక్టర్ చంద్ర ఇగ్గ మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రధానంగా పిల్లలు మహిళలకు 24/7 అత్యవసర సేవలు అందించినట్లు ఈ సందర్భంగా తెలిపారు మహిళలు పిల్లలు సురక్షణలో అత్యధిక ప్రమాణాలు కట్టుబడి ఉంటాయని వైద్య ప్రమాణాలు మరింత బలోపతం చేయడానికి తోడ్పాటు అందిస్తామని ఆధునిక సౌకర్యాలతో అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో ప్రథమ శ్రేణిలో ఆదిత్య హాస్పిటల్ నమ్మకం మరియు నైపుణ్యంతో ఎల్లవేళల ముందుంటుందని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి మహేందర్ రెడ్డి టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజాత నాయక్ మాజీ కార్పొరేటర్ హస్తినాపురం పద్మానాయక్ మాజీ కార్పొరేటర్ అస్తినపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## “మౌనం ఎందుకు? ఒక చిన్నారి మరణంపై రాజకీయ బాధ్యత”

**రెండు నెలల పసి గుడ్డు చనిపోయిన కుమ్మెర ఘటన తెలంగాణ సమాజం మనసును కుదిపేసిన దుర్ఘటన. ఒక పసిపాప ప్రాణం కోల్పోవడం అనేది కేవలం ఒక కుటుంబానికి చెందిన విషాదం మాత్రమే కాదు,అది సమాజానికి అద్దం పట్టే సంఘటన. ఆ సంఘటనపై అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎలా స్పందించింది? ప్రతిపక్షం ఎలా స్పందించింది? జాతీయ నాయకత్వం ఏ విధంగా స్పందించింది? అనే ప్రశ్నలు సహజంగానే ముందుకొస్తాయి. ముఖ్యంగా బాధిత కుటుంబం బీసీ సమాజానికి చెందినదిగా భావిస్తున్న నేపథ్యంలో ఈ విషాదానికి రాజకీయ, సామాజిక పరిమాణాలు కూడా జతకట్టాయి.**



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమంత్రి కేవలం పరిపాలనాధికారి మాత్రమే కాదు, ప్రజల బాధలో భాగస్వామి కావాల్సిన నాయకుడు. రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న రేవంత్ రెడ్డి ఈ ఘటనపై వెంటనే ప్రత్యక్ష స్పందన ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిచ్చింది. ప్రజలు ఆశించేది రాజకీయ ప్రకటనలు కాదు, బాధిత కుటుంబాన్ని పరామర్శించే మానవత్వం. ఒక చిన్నారి మరణం వంటి విషాదం చోటుచేసుకున్నప్పుడు ముఖ్యమంత్రి నేరుగా స్పందించడం, దర్యాప్తు ఆదేశించడం, బాధితులకు భరోసా ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవడం సహజమైన పరిపాలనా ధర్మం. ఆ చర్యలు ఆలస్యమైతే, అది నిర్లక్ష్యంగా భావించబడుతుంది. ఈ భావన బీసీ సమాజంలో మరింత బలపడుతోంది.

కాంగ్రెస్ పార్టీ చాలా కాలంగా సామాజిక న్యాయం, అణగారిన వర్గాల సాధికారత, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను తన సిద్ధాంతంగా ప్రకటిస్తోంది. అలాంటి సందర్భంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కుమ్మెరకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించడం ఒక రాజకీయ చర్య మాత్రమే కాకుండా ఒక నైతిక ప్రకటనగా ఉండేది. ఒక చిన్నారి మరణంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పడం ద్వారా పార్టీ తన విలువలను ప్రదర్శించగలిగేది. అదే సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని నిష్పక్షపాత దర్యాప్తు చేయాలని సూచించడం ద్వారా పార్టీ అంతర్గత బాధ్యతను కూడా ప్రదర్శించగలిగేది. కానీ ఆ స్థాయి జాతీయ స్పందన కనిపించకపోవడం కాంగ్రెస్ మాటలకూ, ఆచరణకూ మధ్య వ్యత్యాసం ఉందనే విమర్శలకు బలం ఇస్తోంది.

ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులను గ్రామానికి పంపించడం పరిపాలనా ప్రక్రియలో భాగం కావచ్చు. కానీ బాధిత సమాజం దాన్ని సమస్యను నీరుగార్చే ప్రయత్నంగా భావిస్తే, అది ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. ప్రజాస్వామ్యంలో నమ్మకం అత్యంత విలువైనది. ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోతే, ఏ చర్య తీసుకున్నా అది సరిపోదు. అందుకే ఈ సందర్భంలో పారదర్శకత అత్యవసరం. సంఘటనపై పూర్తి వివరాలు, దర్యాప్తు దిశ, బాధితులకు ఇచ్చే న్యాయం అన్నీ ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి.

ఈ నేపథ్యంలో కొన్ని వర్గాలు స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, సామాజిక ఆలోచకుడు కంచ ఐలయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి వంటి వ్యక్తులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వాస్తవాలను వెలికితీయాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కమిటీ ఏర్పాటు చేస్తే రెండు ప్రయోజనాలు ఉంటాయి. ఒకటి ప్రభుత్వం దాచిపెట్టే ఉద్దేశం లేదని నిరూపించుకోవచ్చు. రెండోది బాధిత సమాజానికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుంది. ప్రభుత్వానికి నిజంగా ఎలాంటి భయం లేకపోతే స్వతంత్ర విచారణకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం లేదు.

ఇక ప్రతిపక్షం పాత్ర కూడా ఇక్కడ కీలకం. మాజీ ముఖ్యమంత్రి, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్ ఇప్పటివరకు గ్రామాన్ని సందర్శించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై గళమెత్తడం రాజకీయ నాయకుల బాధ్యత. అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ కోరడం, గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించడం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నించడం వంటి చర్యలు ప్రతిపక్షం చేపట్టాలి. అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. ప్రతిపక్షం మౌనం వహిస్తే ప్రజలు నిరాశ చెందుతారు.

తెలంగాణ రాజకీయాల్లో “ప్రజా పాలన”, “సామాజిక న్యాయం” వంటి పదాలు తరచూ వినిపిస్తాయి. కానీ ఒక బీసీ కుటుంబం విషాదంలో ఉన్నప్పుడు ఆ నినాదాలు ఆచరణలో కనిపించకపోతే, అవి కేవలం ఎన్నికల హామీలుగా మిగిలిపోతాయి. బీసీ సమాజం రాష్ట్రంలో పెద్ద వర్గం. వారి గౌరవం, భద్రత, న్యాయభావన దెబ్బతింటే అది రాజకీయంగా కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక చిన్న గ్రామంలో జరిగిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీస్తుంది. సోషల్ మీడియా యుగంలో ఒక సంఘటన క్షణాల్లో ప్రజల ముందుకు వస్తుంది. అందుకే రాజకీయ నాయకులు మరింత బాధ్యతగా వ్యవహరించాలి.

ఈ ఘటన కేవలం ఒక చిన్నారి మరణంతో ముగియకూడదు. అది పరిపాలనా వ్యవస్థలోని లోపాలను వెలికితీయాలి. పోలీసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగిందా? స్థానిక అధికారులు తమ బాధ్యత నిర్వర్తించారా? ఆరోగ్య, భద్రతా అంశాల్లో ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రకటించడం ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అసలు న్యాయం అంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలతో ముగిసే వ్యవస్థ కాదు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించడం, ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పౌర సమాజం వాస్తవాలను వెలికితీయడం ఇవన్నీ కలిసి ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. ఈ ఘటనలో ఈ మూడు స్థాయిలు ఎంతవరకు పనిచేశాయి అన్నది సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ సమాజం గతంలో ఎన్నో ఉద్యమాలు చేసింది. స్వాభిమానంతో రాష్ట్రాన్ని సాధించింది. అలాంటి సమాజం ఒక పసిపాప మరణంపై మౌనం వహించదు. అది న్యాయం కోరుతుంది. కులం, మతం, వర్గం అనే భేదాలు పక్కనపెట్టి మానవత్వాన్ని ముందుకు తెచ్చే రాజకీయ సంస్కృతి అవసరం. ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ తమ తమ రాజకీయ లాభనష్టాలను పక్కనపెట్టి ఈ ఘటనను మానవీయ దృక్పథంతో చూడాలి.

ఒక పసిపాప ప్రాణం తిరిగి రాదు. కానీ ఆ ప్రాణం కోల్పోయిన కుటుంబానికి న్యాయం జరగాలి. సమాజానికి సందేశం వెళ్లాలి ఈ రాష్ట్రంలో ఎవరికైనా అన్యాయం జరిగితే ప్రభుత్వం మౌనం వహించదు, ప్రతిపక్షం మౌనం వహించదు, సమాజం కూడా మౌనం వహించదు. న్యాయం జరిగే వరకు, వాస్తవాలు బయటపడే వరకు, బాధ్యులు శిక్షపడే వరకు ఈ చర్చ కొనసాగాలి.

ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తే ప్రజల విశ్వాసం నిలుస్తుంది. ప్రతిపక్షం తన బాధ్యతను నిర్వర్తిస్తే ప్రజాస్వామ్యం బలపడుతుంది. జాతీయ నాయకత్వం స్పందిస్తే రాజకీయ విలువలకు బలం చేకూరుతుంది. ఈ మూడు అంశాలు కలిసివస్తేనే తెలంగాణ సమాజం నిజమైన సామాజిక న్యాయాన్ని అనుభవిస్తుంది.

కుమ్మెర ఘటన ఒక విషాదం మాత్రమే కాదు, అది రాజకీయ నాయకత్వానికి పరీక్ష. మాటలకంటే చర్యలు ముఖ్యం. ప్రకటనలకంటే న్యాయం ముఖ్యం. ఒక చిన్నారి ప్రాణం కోల్పోయిన ఈ ఘటన చరిత్రలో ఒక పాఠంగా నిలవాలంటే ప్రభుత్వం పారదర్శకంగా, ప్రతిపక్షం బాధ్యతగా, సమాజం చైతన్యంగా వ్యవహరించాలి. అప్పుడు మాత్రమే “ప్రజా పాలన” అనే పదానికి అర్థం ఉంటుంది. లేదంటే అది కేవలం నినాదంగా మిగిలిపోతుంది అనేది నగ్న సత్యం.

## శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి

**మునుగోడు వెలుతురు మార్చి 01:**
మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో ఆదివారం రోజున నిర్వహించిన శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకుని గ్రామ ప్రజలు సుఖశాంతులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాము... ఈ





కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు...

# బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పించాలి

**- పేరుకే సామాజిక న్యాయం ఆచరణలో మాత్రం శూన్యం**

**- నేడు రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ విజ్ఞప్తి.**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:** బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు.మార్చి 2న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటిస్తున్న సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద లింగంగౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆశలకు ఆశయాలకు అనుగుణంగా ఇక్కడున్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పనిచేయడం లేదని కేవలం ఒకే ఒక సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకి సామాజిక న్యాయం కానీ దానిని ఆచరణలో మాత్రం చూపడం లేదన్నారు.రాహుల్ గాంధీ గారేమో సామాజిక న్యాయమని చెప్పి భారతదేశ మంతా తిరుగుతూ జనాభాలో ఎవరు ఎంత శాతం మంది ఉన్నారో వారికి అంత శాతం పదవులు న్యాయం దక్కాలని అంటూంటే తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ అయ్యి నామినేట్ పదవులు బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 శాతం పదవులు ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్, శివ యాదవ్,గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు యంగలి గోపి గౌడ్, అరవింద్, నాగరాజు దండెంపల్లి మనోజ్ మరియు తదితరులు పాల్గొన్నారు

# అద్దె ఇళ్లలో నివాసం ఉండే పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి

**- పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే ఇవ్వాలి: సిపిఎం డిమాండ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:** ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు కవాడిగూడ డివిజన్లోని తాళ్లబస్తీలో సిపిఐఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు ఇస్తామని ప్రజా పాలన దరఖాస్తులు తీసుకొని రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు నగరంలో ఒక్కరికి కూడా ఇల్లు కట్టించి ఇవ్వలేదని విమర్శించారు. ప్రజా పాలనలో దరఖాస్తులను శ్రీ1 శ్రీ2 శ్రీ3 కేటగిరీలలో విభజించి ఆన్లైన్లో ఉంచరు. దీని ద్వారా ప్రభుత్వ లిస్టులో తమ పేరు ఉన్నదని సంతృప్తి తప్ప పేదల సొంతింటి కల నెరవేరలేద అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరం చుట్టుముట్టు నిర్మించిన 35వేల డబల్ బెడ్ రూమ్ ఇల్లు అసంపూర్తిగా నిర్మాణం చేసి ఉన్నాయి వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇల్ల నిర్మాణం పూర్తి చేసి పేదల కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో అనేక ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయని వాటిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్, జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు విమల, బాబు, జోన్ నాయకులు చారి, రోజా తదితరులు పాల్గొన్నారు.

# కాటం రాజు కుటుంబానికి లక్ష రూపాయలను ప్రకటించిన చలమల్ల కృష్ణారెడ్డి





**మునుగోడు,వెలుతురు న్యూస్ మార్చి 01:** మండలంలోని కిష్టాపురం గ్రామం లో ఇటీవల జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమితో మానసికంగా కృంగి హృదయాఘాతం (గుండెపోటు)తో మృతిచెందిన చెన్నగోని కాటంరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సురిగి నరసింహ గౌడ్ , మహేశ్వరం భరత్ కుమార్ వార్డ్ నెంబర్ ,నిరుడు శేఖర్ ముదిరాజ్ ,మైసూర్ కందుల రవికుమార్ ,పాలుట్ల ప్రేమ్ కుమార్ ,ఈరటి చెన్నయ్య ,యాదవ్ మునుకుంట్ల, నూతన కంటి లింగస్వామిశ్రీను ,నందిపాటి లక్ష్మయ్య,పాలెం వెంకటేష్, ఉమ్మెత్తలా శివప్రసాద్ ,ఉమ్మెత్తలా సాయికిరణ్ ,అరురీ మాసయ్య ,జాజుల సాయికుమార్ , మహేశ్వరం నవీన్ ,బబ్లు జాదుల ,ప్రభాకర్ ,మైసూర్ ,జాజుల చిన్న లింగస్వామి, సురిగి లింగస్వామి ,తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా మరియు ఇజ్రాయెల్ తమ తీరు మార్చుకోవాలి

**- యుద్ధంతో ఏదీ సాధించలేరని, ప్రపంచ దేశాలు శాంతినే కోరుకుంటున్నాయి**

**- తాటికొండ విక్రమ్ గౌడ్**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 01:** అమెరికాఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తెలిపారు. ఇప్పటికే దుబాయ్ ఎయిర్‌పోర్టులో వేలాదిమంది చిక్కుకుపోయినట్లు సమాచారం ఉండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందన్నారు. భారతదేశానికి చెందిన లక్షలాది కార్మికులు దుబాయ్, అబుదాబి, కువైట్ ప్రాంతాల్లో ఉన్న నేపథ్యంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే శాంతి చర్చలకు పిలుపునివ్వాలని ఆయన కోరారు. అమెరికాఇజ్రాయెల్‌ను కాకుండా అబుదాబి మరియు యూఏఈపై దాడులు చేయడం అసాంఘిక చర్యలని ఆయన తీవ్రంగా ఖండించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించి సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పెద్ద అంబర్ పేట్ నూతన ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

**అబ్దుల్లాపూర్ మెట్ వెలుతురు మార్చి01:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య సం ఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం వైభవంగాజై వాసవి మాత జైజై వాసవి మాత పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఘ నంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది ఈకార్యక్రమంవాసవి కన్యక పరమేశ్వరి దేవాలయం ప్రాం గణంలో ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది దేవాలయ ప్రాంగణం ఆర్యవైశ్య బం ధుమి త్రులతో కళకళలాడింది సంఘ అభివృద్ధి సేవా దృక్పథం మరియు సామాజిక బాధ్యతల ను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారు ఒకటి జన రల్ కమిటీ కాగా మరొకటి ప్రత్యేక మహిళా కమిటీ నూ తనంగా ఎన్నికైన కమిటీ సభ్యులం ద రూ సమాజసేవఅంకి తభావంతో పని చేస్తామని ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను స్వీక రిం చారుఈకార్యక్రమానికి రాష్ట్ర నాయకులు అమరవాది లక్ష్మీనారాయణగుప్త జిల్లానాయకులు స దానందం వివిధ మండలాలు గ్రామాల నుండి వచ్చిన నాయకులు మరియు పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య బంధు



మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారునూతన కార్యవర్గం గౌరవాధ్యక్షుడు మాధవ్ శెట్టి వెంకయ్య గుప్తాఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా జరి గింది అధ్యక్షుడిగా నారాయణ రాజేశ్వరి గుప్తా ప్రధాన కార్యదర్శిగా మాదంశెట్టి నరేంద్ర గుప్తా కో శా ధికారిగా పారేపల్లి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు అదేవిధంగా ఉపాధ్యక్షులు కార్యద ర్శు లు సహాయ కార్యదర్శులు సంఘటన కార్యదర్శులు తమ తమ పదవులపై ప్రమాణస్వీకారం చే శారు మహిళా కమిటీ తరపున అధ్యక్షురాలిగా సరస్వతి ప్రధానకార్యదర్శిగా సంధ్య మరియు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టి మహిళా శక్తిని సమాజ అభివృద్ధికి వినియోగించ నున్నట్లు తెలిపారు ఈకార్యక్రమంలో మాజీ కమిటీ సభ్యులతోపాట గుడిపాటి శ్రీనివాస్ గుప్తా మరియు మీలా విజయ్ కుమార్ మాధవ్ శెట్టి రాణి తదితరులు పాల్గొన్నారు సభలో ప్రసంగిం చిన నాయకులు ఆర్యవైశ్యుల ఐక్యతే సంఘ బలమని సమాజంలోని బీద ప్రజలకు సేవ చేయ డం ప్రతి ఒక్కరి ధర్మమని పేర్కొన్నారు యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయాలని దేవాలయ కార్యక్రమాలలో అధికంగా పాల్గొని ఆధ్యాత్మికతను పెంపొందించాలని పిలుపునిచ్చారు చివరగా నూతన కార్యవర్గానికి సభికులందరూ చప్పట్లతో ఆమోదం తెలుపు తూ ఆశీర్వాదాలు అందించారు కార్యక్రమం అనంతరం అన్నదాన విందు ఏర్పాటు చేయబడిం ది ఈ నూతన కార్యవర్గం నాయకత్వంలో పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య సంఘం మరింత అభివృ ద్ధి పథంలో ముందుకు సాగాలని సభి కులంతా ఆకాంక్షించారు

# ఘనంగా ఏబిసి కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు..





**కరీంనగర్ వెలుతురు మార్చి 01:** ఏబీసీ కిడ్స్ ప్లే స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలు కరీంనగర్ అల్కాపూర్ లోని శ్రద్ధ ఇన్ బాంకెట్ హాల్‌లో ఘనంగా జరిగాయి. చిన్నారుల ఆటపాటలతో, సాంస్కృతిక ప్రదర్శనలు,కరాటే ప్రదర్శనలు, స్కిట్‌లు, ఫ్యాన్సీ డ్రెస్ వాకింగ్ వినోదాత్మక ప్రదర్శనలతో సహా వివిధ రకాల రంగురంగుల కళ సాంస్కృతిక కార్యక్రమాలతో వార్షికోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితులు చిన్న జీయర్ స్వామి శిష్యులతో ,విశిష్ట అతిథుల సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ లుపడిశెట్టి వసంతలక్ష్మి బూమయ్య ,మాసం గణేష్ , వెల్ది సర్పంచ్ పెంచాల కిషన్ రావు (మానకొండూర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు), డాక్టర్లు మనీష్ , ఎజ్జగిరి శ్రీనివాస్ , రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, సదా చారి (ఎండి, సుమన్ టీవీ కరీంనగర్), సామాజిక కార్యకర్త రాము డంపేటి ప్రత్యేక విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ మనోజ్ కుమార్ వేడుకలో అతిథులందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు.

# జెడ్పి డిప్యూటీ సీఈఓకు పదవీ విరమణ సన్మానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి1** నిజామాబాద్ జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓగా పనిచేసిన కే రాజ్ వీర్ నకు ఆదివారం కామారెడ్డి జిల్లా దోమకొండ సర్పంచ్ ఐరేణి నర్సయ్య, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ పదవీ విరమణ సన్మానం చేశారు. డిచ్ పల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహించి, గత నాలుగు రోజుల క్రితం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గా పదోన్నతి పొందారు. వీడీవోగా ఉద్యోగంలో చేరి, అంచెలంచెలుగా జెడ్పి డిప్యూటీ సీఈఓ వరకు సేవలందించారని వారన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు, ప్రజా సేవలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. గ్రామం నుండి జిల్లా స్థాయి అధికారిగా ఎదగడం గ్రామానికే గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రి శేఖర్, నేతుల సుధాకర్, అబ్రబోయిన రాజేందర్, పిన్నెం రామచంద్రం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిందువుగా మొదలై సింధువుగా మారినట్టు ఆర్ఎస్ఎస్ ప్రస్థానం...

**- ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి పాక మురళి జి...**











**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 01:** బిందువుగా మొదలై సింధువుగా మారినట్టు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రస్థానం కొనసాగించి, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ వాద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి పాక మురళి జి తెలిపారు. ఆదివారం రోజున ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శాఖల సాంఘిక్ కార్యక్రమం నుస్తులాపూర్ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయత భావనలతో స్ఫూర్తి పొందిన డాక్టర్ కేశవ్ బలిరాం హేడ్గేవార్ కొందరు యువకులతో కలిసి 1925 విజయదశమి రోజున నాగపూర్ లో ఆర్ఎస్ఎస్ ను ప్రారంభించారన్నారు. హిందూ సమాజంలో సౌశీల్యాన్ని పెంపొందించి జాతి నిర్మాణంలో భాగస్వామ్యం చేయడం ""“డాక్టర్ జి“గా ప్రసిద్ధి పొందిన హెడ్గే వార్ ఎంచుకున్న ఆశయమన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశ హితం కోసమే పనిచేసిందన్నారు. స్వాతంత్రానంతరం ఆర్ఎస్ఎస్ మూడు సార్లు నిషేధానికి గురైందని , మహాత్మా గాంధీ హత్య అనంతరం, ఎమర్జెన్సీ కాలంలో, బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం నిషేధానికి గురైన సంస్థ శక్తి మంతమైందే తప్ప వెనుకంజ వేయలేదన్నారు. లక్షల శాఖలు నిర్వహిస్తూ తన భావజాలాన్ని దేశంలో మారుమూల ప్రాంతాల వరకు వ్యాపింప చేసుకుంటూ ముందు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ముందు తిమ్మాపూర్ ఖండ, ఉపఖండ స్వయం సేవకులు సాంఘిక్ కార్యక్రమంలో పాల్గొని వ్యాయామం, క్రీడలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంత సమరసాత సహ కార్యకారిణి పుల్లూరి రామారావు, జిల్లా సేవా ప్రముఖ్ మొగిలి సంపత్ జీ, ఖండ కార్యవాహ, ఆవుల కుమార్ జి ,ధరిపెల్లి నరసింగరావు, కోయడ రవిచంద్ర,గగుల అజయ్, రాపర్తి శ్రీనివాస్ లతో పాటు తిమ్మాపూర్ స్వయం సేవకులు పాల్గొన్నారు.

# మనూర్ మండల కేంద్రంలో ఘనంగా బీరప్ప జాతర మహోత్సవం

**- స్వామివారి దర్శించిన మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి తదితరులు...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 01:** సంగారెడ్డి జిల్లా మనూర్ మండల కేంద్రంలో జరిగే బీరప్ప జాతర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. గ్రామ దేవతగా పూజలు అందుకునే బీరప్ప దేవుడు జాతర సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి జాతరలో పాల్గొని బీరప్ప స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే సీనియర్ నాయకులు గొల్ల అశోక్, యువ నాయకులు కాశీనాథ్, రాజు, మహేష్, సునీల్, నాగేష్, మల్లేష్ తదితరులు హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. సంప్రదాయ భజనలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో మండల కేంద్రం పండుగ వాతావరణంలో మునిగిపోయింది.

# అంకమ్మ తల్లి తిరునాళ్లకు కోమట్లగూడెం సిద్ధం

**మార్చి 15 వరకు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు**

**ఖమ్మం జిల్లా, వెలుతురు కోమట్లగూడెం, మార్చి 01:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు మార్చి 1 నుండి 5 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. గత 28 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న ఈ మహోత్సవాలు ప్రాంతీయ ఆధ్యాత్మిక వేడుకగా గుర్తింపు పొందాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామం



శ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి



శ్రీ లక్ష్మీ మద్దిరావమ్మ తల్లి

మొత్తం ఉత్సవ శోభతో కళకళలాడనుంది.మహోత్సవాల తొలి రోజు మహాభిషేకం, ప్రత్యేక పూజలు, స్వామివారి ఊరేగింపు నిర్వహించబడతాయి. మార్చి 2న ఉదయం తీర్థప్రసాదం, అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి కళ్యాణం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. మార్చి 3న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించబడతాయి. మార్చి 5న “డాన్స్ బేబీ డాన్స్” పోటీలు జరగనున్నాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయబడతాయి. పోటీల నిర్వహణకు అవులూరి రామిరెడ్డి, రాయల శ్రీను, వేముల జానకిరాములు సమన్వయ బాధ్యతలు చేపట్టారు. జాతర ప్రారంభోత్సవాన్ని చింతకాని సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వీరేందర్ ప్రారంభించనున్నారు. మహోత్సవాల నిర్వహణలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు చురుకుగా పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## జ్ఞానానికి దిక్సూచి జగద్గురు ఆది శంకరాచార్యులు

- వైరాగ్య శిఖామణి అవధూత
- ఈనెల 5న విగ్రహావిష్కరణ
- హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 01:** సనాతన ధర్మ పరిరక్షణలో విశిష్ట స్థానం సంపాదించిన జగద్గురు ఆది శంకరాచార్యులు భారతీయ ఆధ్యాత్మిక లోకంలో చిరస్థాయిగా నిలిచారని సంగారెడ్డి జిల్లా బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమం పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ పేర్కొన్నారు. అద్భుతమైన జ్ఞానం, లోతైన తత్వచింతనతో అద్వైత వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, "బ్రహ్మం ఒక్కటే సత్యం" అనే పరమార్థ సిద్ధాంతాన్ని మానవజాతికి బోధించిన మహనీయుడు శంకరాచార్యులని ఆయన అన్నారు. ఆశ్రమ ఆవరణంలో ఈ నెల 5న నిర్వహించనున్న దత్తగిరి మహారాజ్ అమర తిథి కార్యక్రమాల సందర్భంగా ఆది శంకరాచార్యుల విగ్రహావిష్కరణకు సంబంధించిన గోడపత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆది శంకరాచార్యుల 108 విగ్రహాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని అవధూత గిరి మహారాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, నాయకులు నీలా వెంకటేశం, నాగన్న పాటిల్, అంజన్న, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది.

## రంజోల్‌లో ముదిరాజ్ సంఘం ఘనంగా నెలవారి సమావేశం

- వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులకు సన్మానాలు...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 01:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారి సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. గ్రామానికి చెందిన ముదిరాజ్ బంధువులు, సంఘం సభ్యులు మరియు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన నాలుగో వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి స్వప్న ప్రవీణ్ కుమార్, ఐదవ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి ప్రేమలత రెడ్డి, ఆరో వార్డ్ కౌన్సిలర్ జన బాయి యాదయ్య గౌడ్ గారిని ముదిరాజ్ సంఘం తరపున ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత, రహదారుల మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అభ్యర్థులు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం సభ్యుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## మంకల్ సుభాష్ సేట్ సతీమణి మృతికి ఎంపీ సురేష్ షెట్కార్ శ్రద్ధాంజలి



**జహీరాబాద్ వెలుతురు మార్చి 01:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన మంకల్ సుభాష్ సేట్ సతీమణి పరమపదం పొందిన విషాద వార్త స్థానికంగా దిగ్భ్రాంతిని కలిగించింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు నివాసానికి చేరుకుని తమ సానుభూతిని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ జహీరాబాద్‌లోని మంకల్ సుభాష్ స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా ఎంపీతో కలిసి నివాళులర్పించారు.

## ఇఫ్తార్ విందులతో పరమత సహనం పెంపొందుతుంది

- 37 వ వార్డు కౌన్సిలర్ మహిపాల్ యాదవ్...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 01:**



ఇఫ్తార్ విందులతో పరమత సహనం పెంపొందుతుందని, జహీరాబాద్ ప్రాంతం గంగా జామున తహెజీబ్ కి ప్రతీక అని పట్టణ 37 వ వార్డు కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం నాడు మట్టణంలోని శాంతి నగర్ లో భాగమైన 37 వ వార్డులో ముస్లింల కోసం కౌన్సిలర్ మహిపాల్ యాదవ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతికగా నిలిచింది. ఇఫ్తార్ విందులో మాజి రైల్వే బోర్డు మెంబర్ షేక్ ఫరిద్, 35 వ వార్డు కౌన్సిలర్ పర్వీన్ అబ్దుల్లా లు హాజరై మహిపాల్ కు శాలువకప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఇఫ్తార్ లో హాజరైన పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలకు మెహెరుమ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ ఫరిద్, అబ్దుల్లా లు మాట్లాడుతూ వార్డు ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం అభినందనీయం అని, తెలంగాణ రాష్ట్రంలో మాజి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల వారికి వారికి సమ ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారని, రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులతో గౌరవించేవారని అన్నారు. కార్యక్రమంలో మాజీ డిఆర్ యూసీసీ మెంబర్ షేక్ ఫరీద్, కౌన్సిలర్లు పెద్దబాయి మహిపాల్ యాదవ్, జాహెద్ అలీ, మొహమ్మద్ జకీర్, మొహమ్మద్ అబ్దుల్లా, నాయకులు మొహమ్మద్ అలిమోద్దీన్, మొహమ్మద్ జుబేర్, మొహమ్మద్ ఫయాజ్, మదుగొండ శ్రీనివాస్, సయ్యద్ అదిల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు, 37 వ వార్డు ముస్లిం పెద్దలు, ఇమాం, మౌజన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థం వీడి ప్రజా సేవ చేయాలి

- ఎల్లవేళల అందుబాటులో ఉంటాం
- కామారెడ్డి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మేయర్,
- చైర్ పర్సన్,కౌన్సిలర్ల కు ఘన సన్మానము







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 1** ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యాక స్వార్థం వీడి ప్రజా సేవ చేయాలనీ ప్రజలకు సేవ చేయడంలోనే సంతోషం ఉందని నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి కరాటే రమేష్ ముదిరాజ్ అన్నారు. నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి రమేష్, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, నిజామాబాద్ కార్పొరేటర్, కామారెడ్డి ఏడుగురు కౌన్సిలర్లు, బాన్సువాడ, ఎల్లారెడ్డి కౌన్సిలర్లకు ఆదివారం నాడు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. సన్మాన సభలో నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి మాట్లాడుతూ ప్రజలకు పట్టణవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేయడంలో సంతోషం ఉందన్నారు. నిజామాబాద్ కామారెడ్డి పట్టణాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామన్నారు. సమాజ సేవ చేసే వారికి ఓటమి ఉండదన్నారు. రూపాయి ఖర్చు లేకుండా సేవ చేయడంతో మేయర్ పీఠం ముదిరాజ్ బిడ్డగా అవకాశం వచ్చిందని నిజామాబాద్ మేయర్ ఉమారాణి కరాటే రమేష్ అన్నారు. సేవ చేయడం ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం ప్రజాప్రతినిధులుగా తమకు వస్తుందని, కాంగ్రెస్ పార్టీ అండతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేష్ గౌడ్ షబ్బీర్ అలీ సహకారంతో మేయర్ మున్సిపల్ చైర్మన్ పదవులు వచ్చయన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామన్నారు. ముదిరాజులను బీసీ డీ నుండి ఏ గ్రూపు ఏ గ్రూపులోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య గృహిణి అయిన తనకు కీలకమైన ముఖ్యమైన నిజామాబాద్ మేయర్ పదవి దొరకడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామన్నారు. స్వార్థం లేకుండా సేవలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులకు గృహిణులకు కీలక పదవులు దొరకడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనీ నిజామాబాద్ మేయర్ ఉమారాణి రమేష్ అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ వహిస్తానన్నారు. నిజామాబాద్ మేయర్ పేరు తన పేరు ఉమారాణి కావడం, ఇద్దరం నిజామాబాద్ కు కామారెడ్డికి ప్రథమ పౌరురాలు కావడం యాదృచ్ఛిక మన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ చైర్ పర్సన్ పదవులు పొందడం సంతోషమని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఉమారాణి అన్నారు. కామారెడ్డి పట్టణాన్ని కులమతాలకతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. విద్యతో జాతి అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షులు మహేష్ గౌడ్ అడ్వైజర్ షబ్బీర్ ల సహకారంతో తమకు పదవులు కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ అన్నారు. ముదిరాజులలో సంఘటితం, ఐక్యత కావాల్సిన అవసరం ఉందన్నారు. అత్యధిక ముదిరాజులు పేదలన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. నిజామాబాద్ మేయర్ ఉమారాణి రమేష్, నిజామాబాద్ కార్పొరేటర్ మటము పవన్, కామారెడ్డి ఏడుగురు కౌన్సిలర్లు పిట్ల వేణుగోపాల్, గేరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ, కాళ్ల రాజమణి గణేష్, దాకి అరవింద్, సునుగురి భాను ప్రకాశ్, బాన్సువాడ కౌన్సిలర్ లింగమేశ్వర్, ఎల్లారెడ్డి కౌన్సిలర్ దుంపల మంజుల శంకర్ లకు కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. మూడు ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముదిరాజ్ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, నీలకంఠం జిల్లా అధ్యక్షులు భూపాల్ విజయానంద్, బట్టు విట్టల్, పట్టణ అధ్యక్షులు కాళ్ల గంగారాజు, ప్రధాన కార్యదర్శి దుబ్బాక ప్రసాద్, ముదిరాజ్ సంఘ నాయకులు పిల్లి మల్లేష్, చింతల రమేష్, గోలివాడ శంకర్, గోలివాడ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులు అన్ని రంగాలలో ఎదగాలి

స్వర్ణకార సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కొండపర్తి బాలా చారి.








**మోత్కూర్, మార్చి 1,(వెలుతురు న్యూస్ ):** స్వర్ణకారులు అన్ని రంగాలలో ఎదగాలని స్వర్ణకార సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కొండపర్తి బాలా చారి అన్నారు ఆదివారం మోత్కూరు మండలం స్వర్ణకార సంఘం ఎన్నికలను స్థానిక ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బాల చారి మాట్లాడుతూ స్వర్ణకారులు ఐక్యమత్యంతో రాజకీయ, విద్యా,సామాజిక ఆర్థిక రంగాలలో ఎదగాలని పిలుపునిచ్చారు. ఎంతో ప్రతిభ కలిగిన స్వర్ణ కారులు సమాజంలో వెనుకబడి పోతున్నారని, ప్రభుత్వం కూడా వీరి అభ్యున్నతి కోసం ప్రత్యేకమైన సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన కాసోజు శ్రీకాంతచారి ఈ మండలానికి చెందిన వాడని ,అలాగే తెలంగాణ తొలి అసెంబ్లీ సభాపతి మధుసూదనాచారి , తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కె. జయశంకర్ సారు, తెలంగాణ తల్లి రూపశిల్పి బిఎల్ఎన్ చారి విశ్వకర్మ జాతికి చెందిన వారేనని ఇలా తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వకర్మలు ఎంతో ముందుండి పోరాటం చేసామని ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి ప్రత్యేకంగా విశ్వకర్మల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు .మోత్కూరు స్వర్ణకార సంఘం మండల వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారులందర్నీ ఒకతాటిపైకి తెచ్చి స్థానికంగా సంఘ భవనం కోసం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్థానికంగా స్వర్ణకారులంతా ఐక్యమత్యంతో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఐక్యతగా కృషి చేయాలని కోరారు. జిల్లా సంఘం ఎప్పుడు తమకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోత్కూరు మండల స్వర్ణకార సంఘం అధ్యక్షునిగా అక్కినేపల్లి వెంకటాచారి ప్రధాన కార్యదర్శిగా మోత్కూరు జయ ప్రసాద్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారితో పాటు జిల్లా సంఘ నాయకులను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లోజు శివకుమార్, మాజీ ఉపాధ్యక్షుడు బోగోజు నరసింహాచారి, ఎన్నికల ఇన్చార్జి కే శ్రీనివాస చారి, పూర్ణాచారి, స్థానిక విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎం బ్రహ్మాచారి, టి మనోహర చారి, సీనియర్ జర్నలిస్టు ఎస్ ఎన్ చారి, చేపూరి అనిల్, ఆకవరం శ్రీనివాసచార్యులు, సంఘ నాయకులు నరసింహ చారి , కొల్లోజు నరేందర్, షణ్ముఖ చారి ,మోత్కూరు నవీన్, మోత్కూరు జగన్ ,బోగోజు రవి, సజ్జన మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- తన అవసరాలకు అణువుగా శంకుస్థాపనలు.
- మల్ల మహేష్, కట్ట లింగస్వామి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, జిల్లా సహాయక కార్యదర్శి.




**మునుగోడు,రూరల్ వెలుతురు మార్చి 01:** మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని చెప్పి ప్రజలు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని గెలిపిస్తే, ప్రజలను మోసం చేస్తూ ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాన్ని కల్వకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేయాలని గతంలో శంకుస్థాపన చేయడం జరిగింది. పాఠశాల నిర్మాణానికి ఆ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి అణువుగా ఉందని రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఆ గ్రామానికి చెందిన దళిత రైతులు కొంత భూమిని సాగు చేస్తున్న కూడా పాఠశాల నిర్మాణానికి ఆ భూమి అవసరమని రాత్రికి రాత్రే పత్తి పంటను నాశనం చేసి సరైనటువంటి పరిహారాన్ని కూడా ఇవ్వకుండా ఆ భూమిని రైతుల వద్ద నుంచి లాక్కొని శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇప్పుడు మర్చిపోయి సోయి తప్పి పాఠశాలను వేరే చోటుకు మారుస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే గారు శంకుస్థాపనలతోటి, సమీక్షల పేరుతోటి కాలయాపన చేస్తున్నారు తప్ప అభివృద్ధి మీద కొంచెం కూడా సోయి లేదని ఎద్దేవా చేశారు. కల్వకుంట్లలో శంకుస్థాపన చేసిన పాఠశాలను ఇప్పుడు మునుగోడు మండల కేంద్రానికి తరలించడం ఆ గ్రామ ప్రజల పట్ల సవతి తల్లి ప్రేమను చూపించడమే అని విమర్శించారు. మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన రాజకీయ నాయకులు వారి అవసరాల కోసం అభివృద్ధి పేరుతోటి శంకుస్థాపనలు చేసుకుంటూ కాలయాపనలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఎక్కడైతే మొదటగా శంకుస్థాపన చేసినారో అక్కడనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాఠశాల విషయమే కాకుండా గతంలో కల్వకుంట్ల గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని చెప్పి కూడా గ్రామ ప్రజలను మోసం చేశారని వారు గుర్తు చేశారు. ఈ గ్రామ పరిధిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా అన్ని మండలాలకు అణువుగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గారు తన వ్యక్తిగత పోకడను మార్చుకొని కల్వకుంట్ల గ్రామంలోనే ఇంటిగ్రెటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎక్కడకక్కడ నిరసన కార్యక్రమాలు చేస్తూ ఎమ్మెల్యే గారిని అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కుక్కల మహేష్, కట్ట ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు కట్ట వెంకన్న, గ్రామ సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి, బొందు శివ, ప్రజా సంఘాల నాయకులు పగిళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.